## కాంగ్రెస్ గూండాల దాడికి సీఎందే బాధ్యత

### ఖమ్మంలో బీఆర్ఎస్ నేతలపై దాడికి కేటీఆర్ ఖండన



ఖమ్మం, సెప్టెంబర్ 3: ఖమ్మంలో కాంగ్రెస్ గూండాల దాడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. మున్నేరు ముంపు బాధితులను పరామర్శించేందుకు, వారి కష్టనష్టాల గురించి తెలుసుకునేందుకు మంగళవారం ఖమ్మంలో పర్యటిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు బృందంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై దాడి చేయడం కాంగ్రెస్ అసహనానికి నిదర్శనమని అన్నారు. ప్రజలకు సాయం చేయడం చేతగాక.. సాయం చేస్తున్న వాళ్లను చూసి ఓర్వలేకనే ఈ దాడికి తెగబడ్డారని దుయ్యబట్టారు. 'మీరు ప్రజలను నిర్లక్ష్యం చేస్తే వారికి మేము అండగా ఉండడమే తప్పా? ప్రజలకు సేవ చేయడం చేతకాదు.. సేవ చేసే వాళ్లపై మాత్రం దాడి చేస్తారా? ఇది సిగ్గుచేటు కాదా?' అంటూ ప్రశ్నించారు. ఇలాంటివి ఎన్ని దాడులు చేసినా సరే.. ప్రజల వద్ద బీఆర్ఎస్ శ్రేణులను వెళ్లకుండా ఆపలేరని స్పష్టం చేశారు. చేతగాని, దద్దమ్మ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో వారికి బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

## వరద బాధితులకు రూ.25 లక్షల నష్టపరిహారమివ్వాలి

- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు
- పార్టీ నాయకులతో కలిసి మణుగూరు పట్టణంలో ధర్నా
- రేగాను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు



ఆందోళన విరమింపజేయాలని కోరుతున్న మణుగూరు సీఐ సతీష్‌కుమార్

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 3: మణుగూరులో ముంపునకు గురైన వరద బాధితులకు న్యాయం చేయాలని, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి మణుగూరు పట్టణంలోని పూలమార్కెట్ వద్ద ధర్నా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో రంగప్రవేశం చేసిన పోలీసులు రేగాను బలవంతంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ మణుగూరుతోపాటు మామిళ్లవాయి, తిర్లాపురం, రామానుజవరం, పగిడేరు, అశ్వాపురం తదితర గ్రామాలు నీట మునిగాయన్నారు. మణుగూరు సుందరయ్యనగర్‌లో పరిస్థితి దారుణంగా ఉందని, ప్రభుత్వం కనీసం బ్లీచింగ్ కూడా చల్లించలేదని, వెంటనే ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు మనోధైర్యం కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు అడ్రస్ లేకుండా పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో వరదలు వచ్చినప్పుడు కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేసి రెండురోజుల్లో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి ప్రతి ఇంటికి రూ.10 వేలు అందించామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరద బాధితులకు భరోసా..

- బీఆర్ఎస్ అండగా ఉంటుంది.. ఎవ్వరూ అధైర్యపడొద్దు..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. చేతగాని దద్దమ్మ..
- ఖమ్మం మున్నేరు వరద ప్రాంతాల పర్యటనలో మాజీ మంత్రి హరీశ్‌రావు
- కేసీఆర్ ఆదేశాలతో ముంపు ప్రాంతాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పర్యటన
- బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన నేతలు
- పర్యటనలో సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, అజయ్, వద్దిరాజు, నామా, కౌశిక్‌రెడ్డి

ఖమ్మం, సెప్టెంబర్ 3 : ఖమ్మం మున్నేరు బాధితులకు భరోసా కలిగింది. నిన్నటి వరకు తమకు అండగా ఎవరూ లేరని, తమను ఆదుకునేవారు లేరని ఆశలు కోల్పోయిన బాధితులకు కొండంత ధైర్యం కలిగింది. బీఆర్ఎస్ నేతలు, మాజీ మ ంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానందగౌడ్, కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, రవీందర్‌రావు తదితరులు మంగళవారం మధ్యాహ్నం ఖమ్మంలోని మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. వెంకటేశ్వరనగర్, సారథినగర్, బొక్కలగడ్డ, పోలేపల్లి ప్రాంతాల్లో బాధితుల కష్టాలను చూసి బాధలను తెలుసుకున్నారు. వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కార్పొరేటర్ తోట రామారావు సమకూర్చిన నిత్యావసర సరుకుల కిట్లను బాధితులకు అందచేశారు.

### ఖమ్మం నగరంలో..

ఖమ్మం వెంకటేశ్వరనగర్ కాలనీకి వచ్చిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృంద సభ్యులు ముందుగా వరదలో సర్వస్వం కోల్పోయి దీనావస్థలో ఉన్న కిరాణా దుకాణ యజమాని భసవేశ్వరరావు ఇంటికి వెళ్లారు. అతడిని, అతడి భార్యను పరామర్శించారు. 'వరద ఏ సమయంలో వచ్చింది? ఎన్ని అడుగులు వచ్చింది?' అని అడిగారు. 'ఇల్లు మొత్తం మునిగిందయ్యా.. మొత్తం బురదలో కొట్టుకుపోయాయి' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. 'ఎవరైనా అధికారులుగానీ, నాయకులుగానీ వచ్చారా? ఏమైన సహాయం చేశారా?' అని హరీశ్‌రావు అడుగగా.. 'ఏ ఒక్కరు రాలేదు' అని సమాధానమిచ్చారు. 'నష్టం ఏ మాత్రం ఉంటుంది?' అని హరీశ్‌రావు అడుగగా.. 'రూ.8 లక్షల వరకూ ఉంటుంది. మమ్ములను ఆదుకోండయ్యా.' అంటూ వేడుకున్నారు. 'తప్పకుండా ఆదుకుంటాం. మీ తరపున ప్రభుత్వంపై పోరాడుతాం. మీకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ముందుంటుంది' అని హరీశ్‌రావు భరోసా కల్పించారు. అక్కడ నుంచి బురదలోనే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నడుచుకుంటూ ముందుకు సాగుతుండగా తల్లాడ మండలానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికులు ఎదురయ్యారు. వారితో హరీశ్‌రావు ముచ్చటించారు. 'ఎక్కడ నుండి వచ్చారు? ఏ పనులు చేస్తున్నారు? భోజనం చేశారా?' అని అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి ఉగ్గుబాల కృష్ణ – రాజ్యలక్ష్మి ఇంట్లోకి వెళ్లారు. బురదలో ఉన్న దుస్తులు, ఇతర సామగ్రిని హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. వరద ఎన్ని అడుగులు వచ్చిందంటూ ఆరా తీశారు. రాజ్యలక్ష్మి భుజాన సబితా ఇంద్రారెడ్డి చేయివేసి ఓదార్చారు. ఇంకా అనేమంది బాధితుల ఇళ్లను పరిశీలించి వారి కష్టాలను తెలుసుకున్నారు.



ఖమ్మం మంచికంటినగర్‌లో వరద ముంపు గురించి అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు అజయ్‌కుమార్, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ వద్దిరాజు

### సీఎం రేవంత్‌రెడ్డి.. చేతగాని దద్దమ్మ: హరీశ్‌రావు

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మున్నేరు వరద బాధితులకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఎవ్వరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ప్రజల కష్టాలను జీపులపైనుంచి చూస్తున్న ఈ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతగాని దద్దమ్మ అని విమర్శించారు.



ఖమ్మం సారథినగర్‌లో నష్టం గురించి ఓ మహిళను అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సబిత, ఎంపీ వద్దిరాజు, మాజీ ఎంపీ నామా, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాల



ఖమ్మం బొక్కలగడ్డలో తడిచిన బియ్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు

### రాజీవ్ గృహకల్పలో పర్యటన

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 3: మున్నేరు వరదకు అతలాకుతలమైన ఖమ్మం జిల్లాలోని ఖమ్మంరూరల్ మండలం రాజీవ్ గృహకల్ప కాలనీలో మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు నాయకులతో కలిసి పర్యటించారు. ఉదయం 12గంటలకు కాలనీ చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు దాదాపు గంటన్నరపాటు కాలనీలోనే పర్యటించారు. ఒక్కో ఇంటికి వెళ్లిన నాయకులు వరద సమయంలో పరిస్థితి, వరద ఉధృతి తగ్గిన తరువాత ప్రభుత్వం నుంచి అందుతున్న సాయం, పారిశుధ్య కార్యక్రమాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. వరద రావడానికి ముందు కాలనీలో అధికారులు ఎవరైనా పర్యటించి అప్రమత్తం చేశారా, ఇంత భారీ నష్టం జరగడానికి ప్రధాన కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి హడావుడి లేకుండా, హంగు ఆర్భాటం లేకుండా నాయకులు స్వయంగా గడపముందుకు వచ్చి అడగడంతో కాలనీవాసులు జరిగిన ఉదాంతం నాయకులకు వివరించారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలోనే కాలనీలకు అధికారులు వచ్చి మున్నేటి ఉధృతిని ముందే పరిశీలించేవారన్నారు. ఏ అధికారి రాకపోవడం, ఎలాంటి హెచ్చరికలు లేకపోవడంతో వరద మా ఇండ్లకు రాదని రాత్రివేళ పడుకోవడం జరిగిందన్నారు. తెల్లవారేసరికి మెళకువ వచ్చిన వారు ఇతరులను అప్రమత్తం చేశారన్నారు. అప్పటికే పరిస్థితి చేయిదాటి పోవడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పై అంతస్తులకు వెళ్లామన్నారు. రాత్రి ఉదయం నుంచి సాయంత్రం వరకు నీళ్లలోనే ఉన్నామని ఒక్క నాయకుడు, అధికారి పడవలు కానీ, కనీసం తెప్పలు కూడా తీసుకరాలేదన్నారు. భగంతుడి దయ వల్ల వర్షం తగ్గిపోవడంతో ప్రాణాలు మిగిలాయన్నారు. వర్షం తగ్గిన నాటి నుంచి మరుసటిరోజు వరకు సైతం తాగడానికి నీరు గానీ, ఆహారం గాని అందించలేదని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి ఆదరబాదరాగా ఇంటికి పదివేలు ఇస్తామని చెప్పారని, ఆ పదివేలకు ఒక్క వస్తువు కూడా రాదన్నారు. కట్టుబట్టలు తప్ప మా దగ్గర ఏమిలేవని విన్నవించుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మోసపోయామని, ఇప్పుడు మా చెప్పుతో మేమే కొట్టుకుంటున్నామన్నారు. వరద బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుందని, ఎవ్వరూ మనోధైర్యం కోల్పోవద్దని నాయకులు భరోసా కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి సాయం అందించే విధంగా కృషి చేస్తామని హరీష్‌రావు ప్రతి ఒక్కరికీ హామీ ఇవ్వడంతో స్థానికులు సంతోషం వ్యక్తంచేశారు.

## కాంగ్రెస్ గూండాగిరి

వివరాలు మెయిన్‌లో..

- ముంపు బాధితులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలపై దాడి
- హరీశ్‌రావు, అజయ్‌కుమార్ వాహనాల అద్దాలు ధ్వంసం



ఖమ్మంలో బీఆర్ఎస్ శ్రేణులపై కర్రలతో దాడి చేస్తున్న కాంగ్రెస్ గూండాలు

## దాడికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలపై ఫిర్యాదు

### సీపీకి ఫిర్యాదు చేసిన ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ



ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు తదితరులు

ఖమ్మం, సెప్టెంబర్ 3 : ఖమ్మంలో బీఆర్ఎస్ నేతలపై దాడికి పాల్పడిన అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు మదన్‌లాల్, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, పగడాల నాగరాజు తదితరులు ఖమ్మం నగర పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మున్నేరు ముంపు బాధితులను పరామర్శిస్తున్న సందర్భంగా కాంగ్రెస్‌కు చెందిన కొందరు రాళ్లతో దాడికి దిగడంతో సంతోశ్‌రెడ్డి అనే బీఆర్ఎస్ నాయకుడు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ వినతిలో పేర్కొన్నారు.

# ఎటుచూసినా బురదే..

- మూడ్రోజులవుతున్నా.. మురుగుపోలే
- రోడ్లు, ఇండ్లన్నీ బురదలోనే.. ఎక్కడి చెత్తా అక్కడే..
- శానిటేషన్ లేదు.. బ్లీచింగ్ చల్లడం లేదు...
- చిమ్మచీకట్లోనే మగ్గుతున్న ముంపు ప్రాంతాలు
- పొంచి ఉన్న వ్యాధులు.. భయంతో ప్రజలు
- బిక్కు బిక్కుమంటున్న ఖమ్మం మున్నేరు వరద బాధితులు







మంచికంటి నగర్‌లో తడిసిన దుస్తులను శుభ్రం చేసుకుంటున్న మహిళలు, బొక్కలగడ్డ వద్ద సామాన్లు శభ్రం చేసుకుంటున్న బాధితులు, ఇంటింటికి తిరిగి పరిశీలిస్తున్న కలెక్టర్ ఖాన్

ఖమ్మం, సెప్టెంబర్ 3 : మున్నేరుకు ముంపు వచ్చి మూడ్రోజులవుతున్నా ఆ మురుగును తొలగించే నాధుడే కరువయ్యాడు. వరద కారణంగా సర్వసం కోల్పోయి కట్టుబట్టలతో ఉన్న బాధితులకు తినడానికి తిండి, తాగడానికి నీళ్లు ఇచ్చేవారు కూడా లేరు... కేవలం అధికారులు, కాంగ్రెస్ నాయకులు నామమాత్రంగా రోడ్లపైన అక్కడ అక్కడ కనిపిస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో బాధితుల వద్దకు వెళ్లివారికి కావాల్సిన కనీస అవసరాలను తీర్చలేకపోతున్నారు. మూడ్రోజుల క్రితం మున్నేరు నదికి గతంలో ఎన్నడూ లేనివిధంగా వరద వచ్చి వేలాది మంది నిరాశ్రయులుగా మారిన సంగతి తెలిసిందే. ఖమ్మం నగరంలోని మున్నేరు శివారు ప్రాంతాలైన బొక్కలగడ్డ, మంచికంటినగర్, వెంకటేశ్వరనగర్, మాణిక్యనగర్, మోతీనగర్, గణేష్‌నగర్, ధ్వంసలాపురం తదితర ప్రాంతాల్లో వరద కారణంగా ఇండ్లు మొత్తం బురదమయంగా మారాయి. నీటి ప్రవాహం తగ్గిన ప్పటికీ ఇండ్లు మొత్తం రెండుమీటర్ల ఎత్తు బురదలోనే ఉన్నవి.. కట్టుబట్టలతో ప్రాణాలను రక్షించుకున్నప్పటికీ వారికి తినడానికి తిండి లేదు, విద్యుత్ సౌకర్యం లేదు, వండు కోవడానికి సరుకులు లేవు.. ఇంతటి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న ముంపు బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కనీస సౌకర్యాలు లేవు..

ఇండ్లలో చేరిన బురద, వంట సామగ్రి, ఇతర వస్తువులకు పట్టిన బురదను శుభ్రం చేయడానికి కనీసం నీళ్లు కూడా సరఫరా చేయడం లేదు. నామమాత్రంగా కార్పొరేషన్ అధికారులు నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజలకు సరిపడా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మెయిన్ వీధుల్లో మాత్రమే నీటి సరఫరా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### చిమ్మచీకట్లోనే ముంపు ప్రాంతాలు..

మున్నేరు నదికి వరద వచ్చిన రోజు నుంచి ప్రజలు చిమ్మచీకట్లోనే గడుపుతున్నారు. విద్యుత్ స్తంభాలు విరిగి, తీగలు తెగి భూమిమీదనే వేలాడుతున్నవి. వరద తగ్గి, వర్షం కూడా లేనప్పటికీ ఇంతవరకు వాటిని తొలగించి, విద్యుత్‌ను పునరుద్ధరించలేదు. చీకట్లో పాములు, తేళ్లు ఇండ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయంతో వణిపోతున్నారు.

### బ్లీచింగ్ చల్లలేదు.. మాత్రలు ఇవ్వలేదు..

బురదను క్లీన్ చేయకపోవడం వల్ల మున్నేరు ముంపు ప్రాంతం మొత్తం దుర్గంధం వెదజల్లుతోంది. తడిసిన బియ్యం వాసన వస్తున్నాయి, మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్‌లను ఏర్పాటు చేయకపోవడం వల్ల బియ్యంను రోడ్లమీదనే పోయడంతో వాసన వస్తున్నాయి. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోగా కనీసం మాత్రలు కూడా ఇవ్వడం లేదు.

### మునిగిన లారీలు.. కార్లు

మున్నేరు వరద కారణంగా లారీల కార్యాలయ ఆవరణంలో గల సుమారు 200 లారీలు మునిగిపోయాయి. అవన్నీ మంగళవారం రోడ్డు మీద పడి ఉన్నవి. వీటి మరమ్మతులకు ఒక్కొక్క లారీకి సుమారు రూ.లక్ష ఖర్చు అవుతుందని లారీ యజమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కార్లు కూడా ఇదే పరిస్థితి. ద్విచక్ర వాహనాలు స్టార్ట్ కాక ఇబ్బందులు పడుతున్నారు.

## వరద బాధితులకు నేను సైతం..

### సీఎం సహాయ నిధికి రూ.3 వేలు అందించిన బాలిక



మహబూబాబాద్ రూరల్: వరద ముంపు బాధితులను ఆదుకోవాలనే ఆలోచనతో తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3 వేలను మంగళవారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీఎం సహాయనిధికి అందిస్తున్న పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయిసింధు. ఈ సందర్భంగా సీఎం సహా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ఎంపీ బలరాంనాయక్.. బాలికను అభినందించారు.

### పంచాయతీ సిబ్బంది కూడా రావట్లే..



మా పక్కన ఉన్న రాజీవ్ గృహకల్పకు మంత్రులు, సీఎం, అధికారులు వెళ్తున్నారు. కానీ మా కాలనీకి ఒక్కరు వచ్చిన పాపాన పోలేదు. వరద తగ్గి రెండు రోజులు అవుతుంది. ప్రభుత్వం తరపున ఒక్కరైనా వచ్చి తిన్నారా.. అని పలకరించలేదు. కనీసం పంచాయతీ సిబ్బంది కూడా రావడం లేదు. కటిక చీకట్లోనే ఉంటున్నాం.

**–నందిగామ కిరణ్‌కుమార్, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, ఖమ్మం రూరల్**

### ఎందుకొచ్చారో తెలవడం లేదు..



సీఎం రేవంత్‌రెడ్డి మా ఇంట్లోకి వచ్చినా నన్ను కలవనీయలేదు. ఒక వైపు పోలీసులు, మరోవైపు నాయకులు ఉన్నారు. కనీసం మాట కూడా నన్ను పిలిచి మాట్లాడలేదు. సరే.. ఏమైనా సాయం చేస్తారేమో అనుకున్నా అది కూడా లేదు. మా కాలనీకి ముఖ్యమంత్రి ఎందుకు వచ్చారో.. ఎందుకు వెళ్లారో తెలవడం లేదు.

**–మూతి సంతోశ్, రాజీవ్ గృహకల్ప, ఖమ్మం రూరల్**

### రెండు రోజుల నుంచి ఇవే బట్టలతో..



పావు గంటలోనే వరద నీరు ఇంటిని చుట్టుముట్టింది. ఏడుస్తూ ఉన్న ఫలంగా కట్టుబట్టలతో ఇంటిని వదిలి బయటకు వచ్చాం. వరద తగ్గిన తర్వాత ఇంటికెళ్లి చూస్తే గుండె ఆగిపోయినంత పనైంది. నిన్నటి నుంచి అవే బట్టలతో ఉంటున్నా. చేతిలో చల్లిగవ్వ లేదు. ఆపదొస్తే ప్రభుత్వం ఉందని అనుడే తప్ప ఎవరూ పట్టించుకోట్లే.

**–పద్మ, నాయుడుపేట, ఖమ్మం రూరల్**

### రెండు రోజుల నుంచి పస్తులే..



రెండు రోజుల నుంచి పస్తులున్నాం. ఇంటి ముందు ఉన్న బురద నీళ్లతోనే కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటున్నాం. గిన్నెలు, బట్టలు ఇక్కడే శుభ్రం చేసుకుంటున్నాం. ఈరోజు హరీశ్‌రావు, సబితమ్మ నా దగ్గరకు వచ్చారు. చేతిలో చెయ్యేసి నీకు సాయం చేపిస్తామని మాటిచ్చారు. కొంత ధైర్యం వచ్చింది. మా కోసం మాట్లాడుతామన్నారు.

**–చంద్రమ్మ, రాజీవ్ గృహకల్ప, ఖమ్మం రూరల్**

### కాంగ్రెస్‌కు ఓటేసి పెద్ద తప్పు చేశాం..



పోయిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసి పెద్ద తప్పు చేశాం. ఇప్పుడు మా చెప్పుతో మేమే కొట్టుకుంటున్నాం. ఇంత గోస పెడతారని అనుకోలేదు. మాకు ప్రభుత్వ సాయం ఏమీ వద్దు. కానీ మా కాలనీలో ఎంతో మంది పూటకు లేని వాళ్లు అరిగోస పడుతున్నారు. ప్రభుత్వం వారిని చూడాలి. లేకపోతే పేదవాళ్ల ఉసురు తగులుతుంది.

**–ఖాజామియా, రాజీవ్ గృహకల్ప, ఖమ్మం రూరల్**

### ఇలాంటి రోజు వస్తుందనుకోలేదు..



నా అరవయ్యేళ్ల జీవితంలో ఇలాంటి రోజు వస్తుందని అనుకోలేదు. కాలనీలో చిన్న కిరాణం, ఫ్యాన్సీ కొట్టు పెట్టుకున్నా. వరదలతో ఒక్క వస్తువు కూడా మిగల్లేదు. ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు ఏ మూలకు సరిపోవు. అధికారులు రాజీవ్ గృహకల్ప భవనాల పరిస్థితిని కూడా అంచనా వేయాలి. అవి ఎప్పుడు కూలుతాయో తెలియదు.

**–వీరభద్రం, చిరు వ్యాపారి, రాజీవ్ గృహకల్ప, ఖమ్మం రూరల్**